పేదలకు దుస్తుల పంపిణీ

దుస్తులు పంపిణీ చేస్తున్న సామాజిక సేవాకర్త హకీమ్

పొతంగల్, మార్చి 9 : రంజాన్ పండుగ సందర్భంగా మండలంలోని జల్లా పల్లి ఫారంలో సామాజిక సేవా కార్యకర్త హకీమ్ 120 మంది పేద ముస్లిం కుటుంబాలకు దుస్తులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హకీమ్ మాట్లాడుతూ.. తాను పుట్టి పెరిగిన గ్రామంలో పేదలకు పండుగ సందర్భంగా దుస్తులను పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం 30 మంది పదోతరగతి విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఎజాజ్ ఖాన్, షేరు, రాములు, బాబా, హబీబ్, పాషా, నజీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో పనులకు కొటేషన్ల ఆహ్వానం

సారంగాపూర్, మార్చి 9 : నగర శివారులోని మాధవ్‌నగర్ సాయిబాబా ఆలయంలో వివిధ రకాల పనులు చేపట్టేందుకు కొటేషన్లు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీరాం రవీందర్ గుప్తా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 5, 6వ తేదీల్లో సాయిబాబా ఆలయంలో శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా ముందుగా చేపట్టే ఏర్పాట్లకు ఈనెల 11న ఉదయం 11 గంటల వరకు కొటేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు దేవాదాయ శాఖ అధికారి సమక్షంలో కొటేషన్లు ఓపెన్ చేస్తామని పేర్కొన్నారు. ఆలయానికి సున్నం, రంగులు వేయడంతో పాటు విద్యుద్దీపాలు, పూల అలంకరణ, టెంట్‌హౌస్ సామగ్రి ఏర్పాటు, వంట పాత్రలు శుభ్రం చేసేందుకు ఆసక్తి ఉన్న వారు కొటేషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

13న ఆర్యసమాజం ఆధ్వర్యంలో కామదహనం

సుభాష్‌నగర్, మార్చి 9 : జిల్లాకేంద్రంలోని గాంధీచౌక్‌లో ఆర్యసమాజం ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన సాయంత్రం 5.30 గంటలకు కామదహన యజ్ఞాన్ని నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కరిపె సూర్యప్రకాశ్ ఆర్య, కార్యదర్శి చౌటు నారాయణ ఆదివారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. 14న ఉదయం 9 గంటలకు దయానంద సరస్వతి ఆశ్రమం ప్రాంగణంలో హోలీ వేడుకలు ఉంటాయని పేర్కొన్నారు. కామదహన కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలో ఎంపిక చేసిన 47 కాలనీల కూడళ్లలో నిర్వహిస్తామని తెలిపారు.

పద్మశాలీలు రాజకీయాల్లో రాణించాలి

డిచ్‌పల్లి, మార్చి 9 : పద్మశాలీలు రాజకీయాల్లో రాణించాలని చేనేత పద్మ సమాక్య రాష్ట్ర అధ్యక్షుడు కొండ రామ్మోహన్ నేత అన్నారు. మండల కేంద్రంలో రాష్ట్ర ముఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహ అధ్యక్షుడు కట్ట అశోక్ నేత, జాయింట్ సెక్రటరీ నల్ల హరికృష్ణ, రాంపల్లి బాలరాజు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువును బాధ్యతగా భావించాలి

సిరికొండ, మార్చి 9 : విద్యార్థులు చదువును భారంగా కాకుండా బాధ్యతగా భావించాలని, ఉన్నత స్థాయి వ్యక్తుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకుని పట్టుదలతో ముందుకు సాగాలని టీయూ రసాయనశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ బాలకిషన్ అన్నారు. మండలకేంద్రంలోని సత్యశోధక్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఎస్సీలను ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరించాలి

పొతంగల్‌లో నిరవధిక దీక్ష ప్రారంభం

నిరవధిక దీక్షలో కూర్చున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పొతంగల్, మార్చి 9 : ఎస్సీలను ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయకార్యదర్శి పోచీరాం మాదిగ డిమాండ్ చేశారు. పొతంగల్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యాదవరావు ఆధ్వర్యంలో ఆదివారం నిరవధిక దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా పోచీరాం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు దీక్షలు కొనసాగుతాయని తెలిపారు. వర్గీకరణ ద్వారానే 59 ఉపకులాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సాయిలు, సంగయ్య, లాలయ్య, వెంకటి, బాలయ్య, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం

ఆటోలో ప్రమాదకరంగా వెళ్తున్న ప్రయాణికులు

కోటగిరి, మార్చి 9 : ప్రతి పల్లెకూ బస్సు సౌకర్యం కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. పల్లెలకు సరిపడా బస్సులు లేకపోవడంతో ఆటోల్లో ప్రయాణం చేయక తప్పడం లేదని పలు గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. కోటగిరి నుంచి సుద్దులం, కొత్తపల్లి, ఎక్లాస్‌పూర్, బస్వాపూర్ గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో మహిళలు ఆదివారం ఇలా ఆటోలో ప్రమాదకరంగా కూర్చొని ప్రయాణించారు.

నగరంలో మున్సిపల్ కమిషనర్ పర్యటన

ఇంటి పన్ను వసూలు ప్రక్రియను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్

కంఠేశ్వర్, మార్చి 9 : జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ ఆదివారం పర్యటించారు. నగరంలోని జోన్-2 పరిధిలో పన్ను వసూళ్ల ప్రక్రియను పరిశీలించి, బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లకు పలు సూచనలు చేశారు. అనంతరం 28వ డివిజన్‌లో సంబంధిత వార్డు అధికారితో కలిసి ఇంటింటికీ తిరిగి పన్ను వసూలు చేశారు. పన్ను వసూలు చేసే బృందాలు టోపీలు ధరించాలని, ఎండదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కార్యక్రమంలో పాల్గొన్న 1996-1997 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

మోస్రా (చందూర్), మార్చి 9 : మోస్రా మండలకేంద్రంలోని భారతీ విద్యా నికేతన్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుకున్న 1996-1997 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారికి చదువు చెప్పిన గురువులను సన్మానించి, ఆశీస్సులు తీసుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విద్యార్థులకు ఒకరికొకరు సహకారం అందించాలని నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, గురువులు పాల్గొన్నారు.

రాయల సుభాష్ చంద్రబోస్ వర్ధంతి

నివాళులర్పిస్తున్న సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు

ఖలీల్‌వాడి, మార్చి 9 : జిల్లాకేంద్రంలోని కోటగల్లీలో ఉన్న ఎన్ఆర్ భవన్‌లో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న) వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, రాజేశ్వర్, కిషన్, రవీందర్, లక్ష్మణ్, శివకుమార్, కిరణ్‌కుమార్, చరణ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం

సిబ్బంది, పాఠకులతో మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజారెడ్డి

ధర్పల్లి, మార్చి 9 : ధర్పల్లి మండలకేంద్రంలోని గ్రంథాలయంలో అదనంగా సౌకర్యాలను కల్పిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ అంతిరెడ్డి రాజారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. గ్రంథాలయాన్ని రూ. 5 లక్షలతో నూతన హంగులతో తీర్చిదిద్దామని, పాఠకుల సౌకర్యార్థం నాలుగు కంప్యూటర్లు, కూలర్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించడంతోపాటు వైఫై సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఈ పనులను వెంటనే ప్రారంభించాలని గ్రంథ పాలకుడు కిషన్‌కు సూచించారు. కార్యక్రమంలో నాయకులు చెలిమెల నర్సయ్య, సుభాష్, గంగారెడ్డి, సురేందర్‌గౌడ్, హమీద్, పోతన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు

నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు

కోటగిరి, మార్చి 9 : మండలంలోని ఎత్తొండ క్యాంప్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. ఒక మరుగుదొడ్డి శిథిలావస్థకు చేరుకోవడం, నీటి సౌకర్యం లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. కొన్నేండ్ల క్రితం నిర్మించిన మరుగుదొడ్డిలో బేసిన్ ఏర్పాటు చేయకపోవడం, నీటి సరఫరా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థినులు బహిర్భూమికి బయటికి వెళ్లాల్సి వస్తున్నది. అధికారులు స్పందించి మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించి, నీటి సౌకర్యం కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆన్‌లైన్‌లో ఆరోతరగతి హాల్‌టికెట్లు

ఇందల్వాయి, మార్చి 9 : మండలకేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం పరీక్ష ఈ నెల 16న ఉంటుందని ప్రిన్సిపాల్ రమేశ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో హాల్‌టిక్కెట్లను అందుబాటులో ఉంచారని, www.tsemrs.cgg.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కార్యక్రమంలో పాల్గొన్న బ్యాంకు సిబ్బంది

ఖలీల్‌వాడి, మార్చి 9 : మహిళలు ధైర్యంగా ముందుకు సాగుతూ అన్ని రంగాల్లో రాణించాలని డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఉద్యోగినులతో కలిసి కేక్ కట్ చేశారు. బ్యాంకులో సీనియర్ మహిళా మేనేజర్లకు సన్మానించారు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ముఖ్య కార్యనిర్వాహణాధికారికి తెలంగాణ కో-ఆపరేటివ్ బ్యాంక్ యూనియన్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, నాగభూషణం, రాధ, నాగభూషణం, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

కంఠేశ్వర్, మార్చి 9 : జిల్లా విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని విజిలెన్స్ పోలీసు, విద్యుత్ శాఖాధికారులు సూచించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొంతమంది వ్యక్తులు మీటరు తిరగకుండా చేస్తామని వినియోగదారుల వద్దకు వచ్చి డబ్బులు తీసుకుని, మీటర్‌లోని కొన్ని వైర్లను కట్ చేస్తున్నారని తెలిపారు. అలా చేయడం చట్టరీత్యా నేరమని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, వీ అండ్ ఏపీటీఎస్/పీఎస్ బి.గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. వినియోగదారులు మోసపోవద్దని, ఇలాంటి వ్యక్తులు వస్తే పోలీసుశాఖ దృష్టికి తీసుకురావాలని కోరారు.

నాలుగు ప్రభుత్వ కొలువులకు జైతాపూర్ యువతి ఎంపిక

మహిత

ఎడపల్లి, మార్చి 9: మండలంలోని జైతాపూర్ గ్రామానికి చెందిన గోవూరి మహిత నాలుగు ప్రభుత్వ కొలువులు సాధించి అందరిచేత ఔరా అనిపించుకుంది. గోవూరి సాయారెడ్డి, మంజుల దంపతుల పెద్ద కూతురు మహిత చిన్నప్పటి నుంచి చదువులో చురుకుగా ఉండేది. ఆమె ప్రతిభను గుర్తించిన తల్లిదండ్రులు ఆమెను బాగా చదివించారు. స్కూల్, కాలేజీ పూర్తికాగానే ప్రభుత్వ కొలువుల కోసం కష్టపడి చదివింది. డిగ్రీలో బీఏ చదివిన అనంతరం ఎంఏ హిస్టరీ పూర్తి చేశారు. మొదట 2019లో పంచాయతీ సెక్రటరీ, వీఆర్వో ఉద్యోగాలు సాధించింది. నీటిపారుదల శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె 2024తో గ్రూప్ -4లో జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించింది. గ్రూప్ -4 ఉద్యోగంలో చేరకుండా జూనియర్ లెక్చరర్ ఉద్యోగం కోసం ప్రయత్నించింది. ఇటీవల వచ్చిన ఫతితాల్లో జగిత్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది. వరుసగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ఆమెను గ్రామస్తులు, స్నేహితులు అభినందించారు.

మహిళా సమాఖ్య వీవోలకు సన్మానం

సమాఖ్య సభ్యులను సన్మానిస్తున్న సంస్థ ప్రతినిధులు

మోర్తాడ్, మార్చి 9: సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళా సమాఖ్య వీవోలు లావణ్య, రుచిత, వసంత, సుజాత, వసుదను సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మామిడాల మనోహర్, గంగాధర్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతనాలు ఎప్పుడిస్తారు?

- డిసెంబర్‌లో చేసిన పనులకు అందని డబ్బులు

చౌట్‌పల్లిలో బ్యాగు ఫిల్లింగ్ పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

మోర్తాడ్, మార్చి9: వేతనాలు అందక ఉపాధి కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 45 రోజులు దాటినా వారికి వేతనాలు రాలేదు. డిసెంబర్ చివరి వరకు నర్సరీల్లో బ్యాగుఫిల్లింగ్ పనులు కొనసాగాయి. జిల్లా వ్యాప్తంగా 530 నర్సరీల్లో దాదాపు మూడు వేల మంది వరకు కూలీలు పనిచేశారు. ఇందులో నర్సరీల నిర్వహణ చూసుకునే వనసేవక్‌లు కూడా ఉన్నారు. వీరంతా డిసెంబర్‌లో పనులు చేయగా పనులకు సంబంధించి జనవరిలో బిల్లులు చేసినప్పటికీ ఇప్పటికీ వేతనాలు రాలేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ కుటుంబాలను ఏవిధంగా పోషించుకోవాలని వాపోతున్నారు. అవసరమున్నపుడు పనులు చేయించుకుని వేతనాలు చెల్లించే విషయంలో పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా వేతనాలు వెంటనే చెల్లించాలని వనసేవక్‌లు, ఉపాధికూలీలు కోరుతున్నారు.

వాటా తేలే వరకూ ఫలితాలు విడుదల చేయొద్దు

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్, మార్చి9: రిజర్వేషన్ల వాటా తేలే వరకూ గ్రూప్స్ ఫలితాలు విడుదల చేయవద్దని ఎమ్మార్పీఎస్ ఆర్మూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి మైలారం బాలు డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మైలారాం బాలు నాయకులతో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రిజర్వేషన్ల వాటాను తేల్చాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

కోడ్ ముగిసినా తొలగని ముసుగులు

ముసుగు తీయని నెహ్రూ విగ్రహం

ఆర్మూర్‌టౌన్, మార్చి9: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసినా పట్టణంలోని విగ్రాహాలకు ఉన్న ముసుగులను మున్సిపల్ అధికారులు తొలగించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని కింది బజార్‌లో ఉన్న జవహర్ లాల్ నెహ్రూ విగ్రహానికి, దోబీ ఘాట్ వద్ద యాల రాములు విగ్రహానికి ఎన్నికల కోడ్ సందర్భంగా గతనెలలో ముసుగులు వేశారు. ప్రస్తుతం కోడ్ ముగిసినా ముసుగులను తొలగించడం లేదు. రోడ్డు నుంచే జిల్లా స్థాయి అధికారులు రోజూ వెళ్తుంటారు. అయినా పట్టించుకోవడం లేదని ప్రజలు అంటున్నారు.

నిందితుల రిమాండ్

మాక్లూర్, మార్చి 9: మండలంలోని అమ్రాద్ తండాలో శనివారం జరిగిన కత్తిపోట్ల ఘటనలో నిందితులైన అన్నదమ్ములు కేతావత్ రమేశ్ అలియాస్ విక్రమ్, కేతావత్ పీర్‌సింగ్‌ను ఆదివారం ఉదయం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. విక్రమ్ వద్ద నుంచి దాడికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులు ఇద్దరినీ అరెస్ట్ చేసి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపనున్నట్లు తెలిపారు. దాడిలో తీవ్రంగా గాయపడిన ముగ్గురు అన్నదమ్ముల ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉన్నదని ఎస్సై పేర్కొన్నారు.

నేడు ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక

మాక్లూర్, మార్చి 9: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక సోమవారం ఉదయం 8.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలను సామాజిక తనిఖీ బృందం సభ్యులు అధికారులకు వివరిస్తారని పేర్కొన్నారు. జిల్లాస్థాయి అధికారులు సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

ధర్నాను విజయవంతం చేయండి

మాక్లూర్, మార్చి 9: వివిధ డిమాండ్లతో ఈనెల 11న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేల్పూర్ భూమయ్య, దేశెట్టి సాయిరెడ్డి కోరారు. మండంలోని బోర్గాం(కె) గ్రామంలో వారు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రూ.రెండు లక్షల లోపు వ్యవసాయ రుణాలను పూర్తిస్థాయిలో మాఫీ చేయాలన్నారు. ఎన్‌సీఎస్ఎఫ్ సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని బెల్లం కేంద్రంగా మార్చి నడపాలని కోరారు. జిల్లాలో రబీలో సాగుచేస్తున్న పొలాలకు నీరందించి పంటలు ఎండిపోకుండా చూడాలన్నారు.

రాయల సుభాష్ చంద్రబోస్‌కు నివాళి

రెంజల్(నవీపేట), మార్చి 9: మండలంలోని బోర్గం గ్రామంలో ఆదివారం సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ ఆధ్వర్యంలో రాయల సుభాష్ చంద్రబోస్ 9వ వర్ధంతి సభను నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో విప్లవ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని పేదల కోసం పేరాటాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ నాయకులు నాగన్న, రాజేశ్వర్, ఒడ్డెన్న, షేక్ నసీర్, లక్ష్మణ్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలి

ఆర్మూర్‌టౌన్, మార్చి9: స్థలాల లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 31లోగా క్రమబద్ధీకరించునేవారికి 25శాతం ఫీజు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ వివరాలతో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, మామిడిపల్లి చౌరస్తా, పెర్కిట్ చౌరస్తా తదితర ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామని తెలిపారు.

హామీలను వెంటనే నెరవేర్చాలి

మోర్తాడ్, మార్చి9: మోర్తాడ్ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిజ్ఞదివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మోర్తాడ్ బస్టాండ్ ప్రాంతంలోని అమరవీరుల స్థూపం వద్ద ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ..తెలంగాణ ఏర్పాటు కోసం పనిచేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో బాబురావు, గంగాధర్, దశరత్, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

ముప్కాల్, మార్చి 9: ముప్కాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం భూదేవి ఇండోర్ స్టేడియం ఆవరణలో ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా కొమ్మల శ్రీనివాస్, సంజీవ్ థామస్, అధ్యక్షులుగా అనికేషి గంగరాజు, కార్యదర్శిగా గంగుల నవీన్, కోశాధికారిగా చిలుక వినోద్, ఉపాధ్యక్షుడిగా చిలుక దినేశ్, సహ కార్యదర్శిగా ఓజ గంగాధర్, కార్యవర్గ సభ్యులుగా పాల్ద వంశీ, జక్కుల ప్రవీణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. మండల కేంద్రం తోపాటు చుట్టు పక్కల గ్రామాల్లో షటిల్ క్రీడను ప్రోత్సహిస్తామని, క్రీడల్లో విద్యార్థులు, యువకులకు మెళకువలను నేర్పుతూ భవిష్యత్తు క్రీడాకారులుగా తీర్చిదిద్దుతామని అన్నారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు మనికాంత్, ప్రశాంత్, బ్రహ్మదండి రఘు, గగన్, రణధీర్ రాకేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ తరగతులకు పాఠశాలల ఎంపిక



కోనాపూర్ పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కంప్యూటర్లు

మోర్తాడ్, మార్చి 9: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా డిజిటల్ విద్యా బోధన చేసేందుకు పాఠశాలలను అధికారులు ఎంపిక చేశారు. ఇందులో భాగంగా కమ్మర్‌పల్లి మండలంలో కోనాపూర్ ఉన్నత పాఠశాల, మోర్తాడ్ మండలం ధర్మోరా ఉన్నత పాఠశాలలు ఎంపికైనట్లు హెచ్ఎంలు రాంప్రసాద్, రఘునందనచారి తెలిపారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం ద్వారా తెలుగు, ఆంగ్ల, గణిత పాఠాలు కంప్యూటర్ ద్వారా విద్యార్థులు నేర్చుకుంటారని తెలిపారు. విద్యార్థులు తక్కువ సమయంలో నాణ్యతతో కూడిన ఇంటరాక్టివ్ పాఠాలు నేర్చుకునే అవకాశం ఉంటుందని వారు తెలిపారు. పాఠశాలలకు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువులో ఎదిగేందుకు కృషి చేయాలని ఎంఈవోలు ఆంధ్రయ్య, సమ్మిరెడ్డి సూచించారు.

విద్యార్థుల విజ్ఞాన, విహారయాత్ర

రెంజల్(నవీపేట)/ఏర్గట్ల, మార్చి 9: పీఎం శ్రీ కార్యక్రమంలో భాగంగా రెంజల్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఆదివారం వైజ్ఞానిక ప్రదర్శనకు వెళ్లారని పాఠశాల ఎచ్ఎం ఆంజనేయులు పేర్కొన్నారు. హైదరాబాద్ ఐఐటీ, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, టీజీ పోలీస్ అకాడమీ, గోల్కొండ కోట, నెహ్రూ జూలాజికల్ పార్క్, రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్ట్, అనేక ప్రదేశాలను చూశారు. విద్యార్థుల వెంట ఉపాధ్యాయులు భూమయ్యప్ప, గంగాధర్, సుధాకర్, అరుణ్, కిశోర్, నాందేవ్, శేఖర్, జగదీశ్, ముత్తయ్య, నరేందర్ తదితరులు ఉన్నారు.

ఏర్గట్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు..

ఏర్గట్ల మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులతో కలిసి విజ్ఞాన విహారయాత్రకు వెళ్లినట్లు హెచ్ఎం కృష్ణాచారి తెలిపారు. యాత్రలో భాగంగా బాసర ట్రిపుల్ ఐటీ కళాశాల విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని సాంకేతిక విద్య ఉపయోగంపై చర్చించారు. అనంతరం బాసర జ్ఞాన సరస్వతీ దేవి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆహ్లాదం కోసం అలీసాగర్‌లో బోటింగ్ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ నాగరాణి, ఉపాధ్యాయులు ప్రసాద్, పవన్, రాజశేఖర్, శ్రీనివాస్, విజయ్, రాజనర్సయ్య, రాజేందర్, గంగాధర్, గంగా మోహన్, నరేశ్, సబిత పాల్గొన్నారు.

నెహ్రూ జూలాజికల్ పార్కులో విద్యార్థులు

బాసరలో ఏర్గట్ల విద్యార్